తెలంగాణభవన్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.
చిత్రంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు హరిశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, వేముల ప్రశాంత్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పార్టీ నాయకులు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నీతారాంనాయక్, వీ ప్రకాశ్ తదితరులు

నిలబడతాం.. కలబడతాం

మొదటిపేజీ తరువాయి...

సర్కార్ చేసిన అభివృద్ధి, సంక్షేమం ఓడిపోయిందని పేర్కొన్నారు. ఓటమికి కారణాలను విశ్లేషించుకొని, ముందుకుసాగితే బీఆర్ఎస్ పడిలేచిన కెరటంవలే తిరిగి నిలబడుతుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాజీ అసెంబ్లీ స్పీకర్లు సిరికొండ మధుసూదనాచారి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీలు ఆజ్మీరా సీతారాంనాయక్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, రేగా కాంతారావు, హరిప్రియనాయక్, శంకర్‌నాయక్, డీఎస్ రెడ్యానాయక్, బడే నాగజ్యోతి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్‌తోపాటు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని జెడ్పీ చైర్‌పర్సన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అన్ని స్థాయి పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి గల కారణాలను విశ్లేషించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, అన్నిస్థాయిల శ్రేణుల మధ్య సమన్వయం లేకపోవడం వంటి కారణాలతో బీఆర్ఎస్ ఓడిపోయిందని, భవిష్యత్తులో అలా జరుగకుండా చూస్తే పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమనే ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణ ప్రజల జీవన ముఖచిత్రాన్ని మార్చాలనే ఆలోచనతో, దార్శనికతతో పాలించారని చెప్పారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడంలో మెతక వైఖరిని అవలంబించామని పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టలేకపోయామని చెప్పారు. ఉద్యోగులకు 73% జీతాలు పెంచిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని చెప్పుకోవడానికి బీఆర్ఎస్ గర్వపడుతుందని, అయినా ఆ వర్గం దూరమైందని పేర్కొన్నారు. 2014లో 29 లక్షల మందికే పింఛన్లు ఉండగా ఆ సంఖ్యను 46 లక్షల మందికి పెంచిన విషయం, 6,47,479 రేషన్‌కార్డులు ఇచ్చిన విషయం చెప్పుకోలేకపోయామని ఉదహరించారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రచారం మీద కంటే పనుల మీదే దృష్టి పెట్టిందని, పనుల మీద కాకుండా ప్రచారం మీద దృష్టిపెడితే రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ సర్కారే అధికారంలోకి వచ్చేదని పేర్కొన్నారు.

తెలంగాణభవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు

మెడికల్ కాలేజీల్లో మానుకోట రికార్డు: హరీశ్

దేశంలో ఒక్క పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నాలుగు మెడికల్ కాలేజీలు ఉన్న నియోజకవర్గం మహబూబాబాద్ అని, దేశంలో ఇదొక రికార్డు అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను కాపాడుకోవాలనే తపనతో కేసీఆర్ చేసిన కృషికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేమి కావాలని ప్రశ్నించారు. ప్రజలకు అన్ని చేసినా దురదృష్టవశాత్తు పార్టీ అధికారంలోకి రాలేదని, పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని చెప్పారు. అందరం కలిసికట్టుగా పనిచేస్తే భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దేనన్న ధీమా వ్యక్తంచేశారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన బీఆర్ఎస్‌నే తెలంగాణ ప్రజలు ఆదరిస్తారని ధీమా వ్యక్తంచేశారు. కార్యకర్తలు, నాయకులకు చిన్న ఆపద వచ్చినా యావత్ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కాపాడుకునేందుకు ట్రస్ట్ ఏర్పాటు చేసి, దాని ద్వారా అన్ని రకాల కార్యక్రమాలు చేపట్టే ఆలోచన ఉన్నదని వెల్లడించారు. అక్రమ కేసుల నుంచి కార్యకర్తలను కాపాడేందుకు లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన విధానం, అవగాహన లేని కారణంగా నాగార్జునసాగర్ కింద సాగునీరు ప్రశ్నార్థకమైందని విమర్శించారు. విద్యుత్‌పై కొత్త పాలసీ తెస్తామంటున్న ప్రభుత్వం 24 గంటల కరెంట్‌ను ఎత్తుగొట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. హామీలను అమలు చేయడం చేతగాక కాళేశ్వరం, విద్యుత్తు అవినీతి అంటూ గోబెల్స్ ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నా రాష్ట్రానికి ఒక్క మేలు జరగలేదని నిప్పులు చెరిగారు.

చంద్రబాబు, వైఎస్‌నే ఎదరించినోళ్లం: పెద్ది

తెలంగాణ ఉద్యమంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లాంటివాళ్లనే ఎదుర్కొన్నామని, సీఎం రేవంత్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందామని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి మోసపూరిత హామీలతో పదవి వచ్చిందని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ ఫ్లస్ కృష్ణార్జునులు : కడియం శ్రీహరి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు కృష్ణార్జునులుగా హరీశ్‌రావు, కేటీఆర్ ఉన్నారని వీరి సారథ్యంలో పార్టీతోపాటు ప్రజలు సుభిక్షంగా ఉంటారని కడియం శ్రీహరి పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో అప్పుడే కుమ్ములాటలు మొదలయ్యాయని చెప్పారు. ప్రభుత్వంలో తానే నెంబర్ 2 అని పొంగులేటి, తన భర్తకు సీఎం పదవి రాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి వాపోతున్నారని ఉదహరించారు. లోపాలను సవరించుకొని కార్యకర్తలకు అగ్రనాయకత్వం అందుబాటులో ఉండాలని సూచించారు.

పోడుపట్టాలిచ్చింది కేసీఆరే: తెల్లం వెంకట్రావ్

దేశంలో రికార్డుస్థాయిలో పోడుభూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలే అనుకోలేదని, చిన్న పొరపాట్లతో బీఆర్ఎస్ ఓడిపోయిందని తెలిపారు.

మనల్ని ప్రజలు పూర్తిగా తిరస్కరించలే

తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను పూర్తిగా తిరస్కరించలేదనే విషయాన్ని పార్టీ క్యాడర్ గుర్తించాలని కేటీఆర్ సూచించారు. అసెంబ్లీలో మూడోవంతు సీట్లు (39 ఎమ్మెల్యేలు) ఇచ్చారని, 14 స్థానాల్లో కేవలం ఆరు వేల ఓట్ల తేడాతో ఓడిపోయామని వివరించారు. రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా 1.85 శాతమేనని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీకి నాయకత్వం సరైన సమయం ఇవ్వలేకపోయిందని ఇకనుంచి తెలంగాణభవన్ కేంద్రంగా తనతోపాటు హరీశ్‌రావు, ఇతర ముఖ్యనాయకులు అందుబాటులో ఉంటారని చెప్పారు. పార్టీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని, పార్టీ కమిటీలు, అనుబంధ కమిటీలు వేసుకొని త్వరలోనే శిక్షణా తరగతులు నిర్వహిస్తామని వెల్లడించారు.

నా మనుమరాలు పుట్టిన రోజుకు రండి

కేటీఆర్, హరీశ్‌రావును ఆహ్వానించిన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): తన మనుమరాలు పుట్టినరోజు కార్యక్రమానికి రావాల్సిందిగా తెలంగాణ మలి ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఆహ్వానించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆమె బీఆర్ఎస్ ముఖ్య నేతలను కలిసి ఆహ్వానించారు. కేటీఆర్, హరీశ్‌రావు, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా శంకరమ్మ కుటుంబ యోగక్షేమాలను మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అడిగి తెలుసుకొన్నారు. పుట్టినరోజు కార్యక్రమానికి వస్తామని చెప్పారు.

కాంగ్రెస్ కూడా అనుకోలేదు

రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ కలలో కూడా ఊహించలేదని, దీంతో నోటికి వచ్చిన హామీలు ఇచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు మాత్రమే కాదని అందులో 420 హామీలు ఉన్నాయని వివరించారు. సరైన హోంవర్క్ చేయకుండానే ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హామీల అమలుకు బీఆర్ఎస్ బాధ్యత గల ప్రతిపక్షంగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. డిసెంబర్ 9 నాడు రుణమాఫీ చేస్తామని ఊదరగొట్టిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. హామీల అమలు సాధ్యం కాదని గ్రహించి రేవంత్‌రెడ్డి సర్కార్ కాలయాపన చేస్తున్నదని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే రాష్ట్ర అప్పులపై, కరెంట్‌పై శ్వేతపత్రాలు విడుదల చేసిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ స్వేదపత్రంతోపాటు కాంగ్రెస్ 420 హామీలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

లోకం పోకడ



అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదు

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫిర్యాదు

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి నియోజకవర్గం పరిధిలోని అధికారులు ప్రొటోకాల్‌ను పాటించడం లేదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయన జిల్లా కలెక్టర్, సీఎస్, అసెంబ్లీ స్పీకర్‌కు లేఖల ద్వారా ఫిర్యాదు చేశారు. బుధవారం సంగారెడ్డిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తాను సరైన సమయానికి చేరుకొన్నా, ప్రారంభించలేదని చెప్పారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి వచ్చిన తర్వాతే ఆ కార్యక్రమాన్ని మొదలుపెట్టారని పేర్కొన్నారు. దీంతో తన మిగతా కార్యక్రమాలు ఆలస్యమయ్యాయని, చెక్కుల కోసం వచ్చిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని తన లేఖలో పేర్కొన్నారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	14.3°c	32.3°c
ఆదిలాబాద్	16.2°c	30.3°c
నల్లగొండ	17.4°c	35.3°c
మెదక్	17.7°c	31.0°c
వరంగల్	18.0°c	31.0°c
హైదరాబాద్	18.5°c	30.5°c
కరీంనగర్	19.0°c	31.0°c
ఖమ్మం	19.0°c	32.0°c
మహబూబ్‌నగర్	19.9°c	32.5°c
నిజామాబాద్	21.2°c	28.9°c

యాసంగి రైతులకు నీళ్లు ఇస్తరా? ఇవ్వరా?

- ధాన్యం సొమ్మును బోనస్‌తో ఇవ్వాలి
- మిర్చి రైతులకు న్యాయం చేయాలి
- రైతుబంధుపై మంత్రులది తలోమాట: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- త్వరలోనే ప్రజల మధ్యకు కేసీఆర్: ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లలో యాసంగి పంటకు సరిపడా నీళ్లు ఉన్నా సర్కార్ ఇవ్వడం లేదని, అసలు రైతులకు నీళ్లు ఇస్తారా? లేదా? అనే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పంట కొనుగోళ్ల విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఎన్నడూ జాప్యం చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే రైతులకు ఇవ్వాల్సిన రూ.వెయ్యి కోట్లను క్వింటాలుకు రూ.500 బోనస్‌తో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రైతుబంధు విషయంలో మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతుబంధు డబ్బులు వేశామని గత నెల 27 సీఎం రేవంత్‌రెడ్డి దబాయించగా, అందరికీ రైతుబంధు వచ్చిందని ఈ నెల 9న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారని, తీరా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంక్రాంతి తరువాత వేస్తామని అసలు విషయం చెప్పారని గుర్తుచేశారు. ఇలా తలోమాట మాట్లాడటం వల్ల రైతుల్లో అయోమయం నెలకొన్నదని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసే విధంగా కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ఎన్నికల కోడ్ పేరుతో తప్పించుకోవాలని చూడొద్దని హితవు చెప్పారు. వరంగల్ ఏనుమాముల, ఖమ్మం మార్కెట్ యార్డుల్లో మిర్చి రైతులు సరైన ధర రాక ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కొత్త విద్యుత్తు పాలసీ తీసుకొస్తామని చెప్తున్న ప్రభుత్వం.. రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత కరెంట్ విషయంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తెస్తాం: సత్యవతి రాథోడ్

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ త్వరలోనే ప్రజల మధ్యకు వస్తారని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ తెలిపారు. కేసీఆర్ పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి వెనుకడుగు వేస్తున్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో గులాబీ జెండా ఎగురవేస్తామన్న ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ ప్రొఫెసర్ ఆజ్మీరా సీతారాంనాయక్, పార్టీ నేతలు రవికుమార్, లింగంపల్లి కిషన్‌రావు, యాకుబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ క్రెడిట్ కేటీఆర్‌దే

- పసిగట్టిన నెటిజన్లు.. కాంగ్రెస్‌కు కౌంటర్లు
- బీఆర్ఎస్ కృషితో ఏడాది కిందటే డీల్
- కాంగ్రెస్ పరివారం నెట్టింట నకిలీ ప్రచారం
- తన ఘనతగా చెప్పుకొంటున్న కాంగ్రెస్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చీరాగానే రాష్ట్రం నుంచి కార్నింగ్ వంటి సంస్థలు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిపోయాయి. దీంతో ఏం చేయాలో పాలుపోని కాంగ్రెస్ పరివారం నకిలీ ప్రచారానికి తెర తీసింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడులను తమ ఘనతగా చెప్పుకోవటం ప్రారంభించింది. ఈ మేరకు సోషల్‌మీడియాలో ప్రచారాన్ని మొదలుపెట్టింది. ఈ విషయాన్ని నెటిజన్లు పసిగట్టి కాంగ్రెస్‌కు కౌంటర్లు ఇస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసుకొన్న ఒప్పందాలను ఆధారాలతో సహా బయటపెట్టి హస్తం శ్రేణులకు చుక్కలు చూపిస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోక బిక్కముఖం వేసుకోవటం ఆ పార్టీ నేతల వంతైంది.



అసలు ఏమైందంటే?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కృషితో అమెజాన్ రూ.20,096 కోట్ల పెట్టుబడులను హైదరాబాద్‌లో పెట్టేందుకు 2020లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొన్నది. విస్తరణలో భాగంగా 2030 నాటికి రూ.36,300 కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా 2022-23లో మరోమారు ఒప్పందం చేసుకొన్నది. ఇదే విషయమై చర్చించేందుకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డితో అమెజాన్ ప్రతినిధుల బృందం సమావేశమైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే హైదరాబాద్‌లో అమెజాన్ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిందంటూ కాంగ్రెస్ అనుకూల మీడియా సోషల్ మీడియాలో ఊదరగొట్టింది. తమ ప్రభుత్వ ఘనతగా అబద్ధపు ప్రచారాన్ని తెరమీదకు తీసుకొచ్చింది. అసలు విషయాన్ని గ్రహించిన నెటిజన్లు.. 2020, 2022-23లో అమెజాన్‌తో కేసీఆర్ ప్రభుత్వం చేసుకొన్న డీల్స్, వార్తల క్లిపింగ్స్‌ను ఆధారాలతో సహా పోస్టుల రూపంలో పెట్టారు. ఒకరి కృషిని తమ ఘనతగా చెప్పుకొంటున్న కాంగ్రెస్.. ఇకనైనా నకిలీ ప్రచారాన్ని మానుకోవాలని గట్టి కౌంటర్లు ఇచ్చారు.

నీళ్ల లెక్క.. నిగూఢం!

మొదటిపేజీ తరువాయి...

నుంచి తాగునీటి కోసం మహారాష్ట్రకు లేఖ రాయాలని నిర్ణయించటంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. కొయినా డ్యామ్ నుంచి 30 టీఎంసీలు కావాలని కోరుతూ సత్వరమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర సాగునీటి పారుదలశాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కృష్ణా బేసిన్‌లో నీటి కొరత ఉన్న నేపథ్యంలో కొయినా నుంచి కరెంటు ఉత్పత్తిని నిలిపివేసి, ఆ నీళ్లను తెలంగాణకు విడుదల చేయాలని కోరేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. బదులుగా కరెంటును గానీ, పరిహారం గానీ అందిస్తామని మహారాష్ట్ర సర్కారు ఎదుట ప్రతిపాదించాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. ఈ మేరకు లేఖ రాశారు. అయితే ఆ నీటి అవసరమేమీ లేదని అధికారులు అంటున్నారు. మరెందుకు మహారాష్ట్ర నీళ్ల కోసం రాష్ట్ర సర్కారు వెంపర్లాడుతున్నది? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

తాగునీటిని తెచ్చుకొనే అవసరం ఉన్నదా?

శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు ఈ ఏడాది పెద్దగా వరదలు రాలేదనేది వాస్తవం. అయితే, భూగర్భజలాలు మాత్రం ఇప్పటికీ పుష్కలంగా ఉన్నాయి. వేసవిలో తగ్గినా అది కూడా స్వల్పంగానే ఉండే అవకాశం ఉన్నదని భూగర్భజలశాఖ గత నివేదికలే తేల్చిచెప్తున్నాయి. ఇదిలా ఉంటే కృష్ణాబేసిన్‌లో తెలంగాణకు ఏడాది పొడవునా తాగునీటి అవసరాలకు 43.94 టీఎంసీలు అవసరమవుతాయని లెక్కలు చెప్తున్నాయి. అందులో హైదరాబాద్ తాగునీటి అవసరాలకు 16.5 టీఎంసీలు, పబ్లిక్ యుటిలిటీ కోసం దాదాపు 4 టీఎంసీలు, సాగర్ కింద నల్లగొండ జిల్లాలో అక్కంపల్లి, పెండ్లిపాకల, ఉదయసముద్రం, ఖమ్మంలోని పాలేరు, వైరా, సాగర్ టెయిల్‌పాండ్ పరిధిలో అవసరాలకు 11.69 టీఎంసీలు అవసరం. మొత్తం రాబోయే ఆరు నెలల కాలానికి లెక్కించినా 21.97 టీఎంసీలు అవసరం అవుతాయి. ప్రస్తుతం జూరాల, శ్రీశైలం ప్రాజెక్టుల్లో తాగునీటి అవసరాలకు సరిపోగా, మిగులు జలాలు అందుబాటులో ఉన్నాయి. ఇక సాగర్‌లో మే నెల వరకు కావాల్సిన నీరు అందుబాటులో ఉన్నది. సాగర్, శ్రీశైలం రెండు రిజర్వాయర్లలో 82.78 టీఎంసీలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయని తేల్చిన కేఆర్ఎంబీ.. అందులో 35 టీఎంసీలను తెలంగాణకు, 45 టీఎంసీలను ఏపీకి కేటాయించింది. రాబోయే మే వరకు నీటి విడుదలకు అనుమతులు మంజూరు చేసింది. అలాంటప్పుడు కొయినా నుంచి ఏకంగా 30 టీఎంసీలను కోరుతుండటం వెనుక ఆంతర్యమేమిటో అర్థంకాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అత్యవసరమైతే సాగర్, శ్రీశైలం నీళ్లు

ఇప్పటికే ఆయా ప్రాజెక్టుల ద్వారా తాగునీటికి కావాల్సిన నిల్వలు ఉన్నాయని, అత్యవసర పరిస్థితుల్లోనూ ఎండీడీఎల్ దిగువకు వెళ్లి మరీ వినియోగించుకోవచ్చని అధికారులే చెప్తున్నారు. సాగర్, శ్రీశైలం 2 ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల అంశంపై అక్టోబర్‌లోనే కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశం కొనసాగింది. ఆ సందర్భంగానే శ్రీశైలం ప్రాజెక్టు ఎండీడీఎల్‌ను 805 ఫీట్లు, సాగర్ ఎండీడీఎల్‌ను 505 ఫీట్లకు నిర్ణయించారు. ఆ వేసవి ఆవిరి నష్టాలను లెక్కగట్టారు. ఆ మేరకే మొత్తంగా రెండు ప్రాజెక్టుల్లో 82.78 టీఎంసీలు వినియోగానికి ఉన్నాయని తేల్చారు. ఒకవేళ అత్యవసరమైతే కేఆర్ఎంబీ అనుమతులతో అంతకంటే దిగువకు సైతం వెళ్లి నీటిని వినియోగించుకునే వెసులుబాటు ఉన్నదని స్పష్టం చేస్తున్నారు. గతంలో అనేక సందర్భాల్లో నీటిని వినియోగించుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇక హైదరాబాద్ తాగునీటి అవసరాలకు పుట్టంగండి వద్ద ఎమర్జెన్సీ మోటర్లు ఉన్నాయని వివరిస్తున్నారు. శ్రీశైలంలో మొత్తంగా 27.14 టీఎంసీలు వినియోగించుకునే అవకాశం ఉన్నదని కేఆర్ఎంబీనే తేల్చింది. అక్కడ కల్వకుర్తి తాగునీటి అవసరాలకు 3.68 టీఎంసీలు, ఏపీ తాగునీటి అవసరాలకు 2 టీఎంసీలు అవసరమవుతాయి. అవి పోయినా ఇంకా 21.46 టీఎంసీలు అందుబాటులో ఉంటాయి. ఆ నీళ్లను దిగువకు ఎన్ఎస్పీలో విడుదల చేయించుకుంటే ఇక్కడి తాగునీటి అవసరాలను తీర్చుకునే అవకాశం ఉన్నది. కరెంటును కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. ఇన్ని అవకాశాలున్నా తెలంగాణ సర్కారు మహారాష్ట్రను తాగుజలాలను కోరటం అర్థం కాకుండా ఉన్నది.

ఏపీని ఎలా నిలువరిస్తారు?

కర్ణాటక నుంచి నీళ్లు దిగువకు వచ్చినా, పూర్తిస్థాయిలో జూరాలలో నిల్వ చేసుకునే వెసులుబాటు తెలంగాణకు లేదు. జూరాల ప్రాజెక్టు నిల్వ 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 6.51 టీఎంసీలు ఉన్నాయి. అంటే అక్కడ 3 టీఎంసీలకే అవకాశం ఉన్నది. సరే అక్కడి నుంచి లిఫ్ట్ చేసుకునే కెపాసిటీ ఉన్నదా? అంటే అదీ లేదు. అంతిమంగా దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేయాల్సిందే. అది ఉమ్మడి ప్రాజెక్టు. అదీగాక ఏపీలోని 7 జిల్లాల్లోని 103 మండలాల్లో కరువు నెలకొన్నది. మొత్తంగా రాయలసీమ జిల్లాలే. ఇప్పటికే ఏపీ అడ్డగోలుగా పోతిరెడ్డిపాడుతో పాటు పలు విధాలుగా నీటిని పెన్నాబేసిన్‌కు మళ్లిస్తున్నది. దాదాపు అవి 125 టీఎంసీలు ఉంటాయని అంచనా. ఇటీవల 5 టీఎంసీల నీటి కోసమే ఏకంగా తెలంగాణ స్వాధీనంలో ఉన్న సాగర్ డ్యామ్‌పైకి సాయుధ బలగాలతో వచ్చి మరీ ముళ్లకంచెను ఏర్పాటు చేసి కుడికాలువ ద్వారా నీటిని తరలించుకుపోయింది. అలాంటిది ఇప్పుడు శ్రీశైలంలోకి నీళ్లు వస్తే ఏపీ మళ్లించకుండా ఉంటుందా? ఏపీ స్వాధీనం చేసుకున్న డ్యామ్‌నే తెలంగాణ సర్కారు ఇప్పటివరకు తిరిగి స్వాధీనం చేసుకోలేదు. మరి దీనిని ఎలా నిలువరిస్తుంది? అనేది అతి పెద్ద ప్రశ్న. ఇన్ని అడ్డంకుల మధ్య మహారాష్ట్ర నుంచి తాగునీటిని తీసుకోవాలని తెలంగాణ సర్కారు ఎందుకు ప్రయత్నిస్తున్నదో అర్థం కాని విషయమే. కర్ణాటక, ఏపీకి లేని అవసరం తెలంగాణకే ఎందుకు వచ్చిందని ఇక్కడ మరొక ప్రశ్న. అసలు ప్రభుత్వం ఇవన్నీ ఆలోచించిందా? అనాలోచితంగా చేసిందా? అనేది ప్రభుత్వమే చెప్పాల్సి ఉన్నది. అయితే రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ సర్కార్ ఇదంతా చేస్తున్నదని, ప్రజలకు ఏదో చేస్తున్నామనే భ్రమలను కల్పించడానికే ఈ ప్రతిపాదన ముందుకు తీసుకువచ్